క్లుప్తంగా

పలుకూరు విద్యార్థికి పీహెచ్‌డీలో గోల్డ్‌మోడల్


హేమద్రి

బనగానపల్లె రూరల్: మండలంలో పలుకూరు గ్రామానికి చెందిన హేమద్రి అగ్రికల్చర్ పీహెచ్‌డీలో గోల్డ్ మోడల్ సాధించారు. అగ్రికల్చర్ ఎంఎస్‌సీ వ్యవసాయ విశ్వవిద్యాలయం బెంగుళ్లూరు పూర్తి చేసిన ఆయన 'మిరప పంటలో తామర పురుగులు' అనే అంశం రాయచూర్‌లో పూర్తి చేసి గోల్డ్ మోడల్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌డీతో పాటు జ్ఞాపికను కర్ణాటక గవర్నర్ తవర్‌చంద్‌గెహెట్ చేతుల మీదుగా అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్: విద్యుత్‌శాఖ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భోజనం విరామ సమయంలో ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆగస్టు 9వరకు నిరసనలు తెలియజేస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే 10వ తేదీ నుంచి నిరవదిక సమ్మె చేపడుతామని ఈ సందర్భంగా జేఏసీ డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రావు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, మధుసూదనరెడ్డి,రియాజ్, రామకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి, రా మాంజనేయులు, రాజేష్, నాగేశ్వరరెడ్డి, రాఘవేంద్రప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆధునిక వైద్యం

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫురుల్లా అన్నా రు.కోవెలకుంట్ల పట్టణంలో రూ. 3.50 కోట్లతో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారి పోయాయన్నారు. ఆసుపత్రుల్లో అన్ని వసతులు, వైద్య సిబ్బందిని నియమించడంతో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్లు మేఘన, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండండి

అవుకు: పశువైద్య సిబ్బంది ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ డీడీ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రం అవుకులోని పశువైద్యశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పశువైద్యాధికారిణి భారతీదేవితో మాట్లాడి సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులు, మేకలు, గొర్రెల పెంపదారులకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ భార్గవి, అటెండర్ మగ్బుల్ హుస్సేన్, గోపాల మిత్ర హరినాథ్, పశుమిత్ర రవి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

బనగానపల్లె: పంట విత్తనం వేసిన తర్వాత తప్పనిసరిగా నమోదు చేయించాలని ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని చెరువు పల్లె గ్రామంలో శుక్రవారం మిరప సాగు చేసిన రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ క్రాప్ ప్రాముఖ్యత గురించి వివరించారు. వర్షాలు జోరుగా కురుస్తున్న నేపథ్యంలో నీటి మునిగిన పైరును కాపాడుకేందుకు చేపట్టాల్సిన చర్యలను ఏఓ రైతులకు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

బెల్లం ఊట ధ్వంసం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాళ్లకొత్తూరు గ్రామ ఆటవీ ప్రాంతంలో నాటుసారా తయారికి సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ సుభాషిణి శుక్రవారం తెలిపారు. గ్రామ సమీపంలోని కొండల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది కలిసి దాడులు చేశామన్నారు. బెల్లం ఊట, 20 లీటర్ల సారా మాత్రమే ఉందని, బెల్లం ఊట బాలజీనాయక్‌కు చెందినదిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అవుకు: మండల కేంద్రం అవుకులో జరిగిన గొడవలో శుక్రవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. స్థానిక పట్టణానికి చెందిన చల్లా సాయి చైతన్య రెడ్డి, చల్లా సాయి చరణ్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి.. మరోవర్గం కురియుల చిన్న మద్దయ్య, గుత్తి శ్రీనివాసులు, ఆకుల రాజుల గొడవ పడుతున్నారని సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హోటల్ బిల్లు విషయంపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుందని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకిసేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన,అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సంప్రదాయబద్ధంగా పల్లకీసేవ నిర్వహించారు.



ఈ ఫొటోలో బర్త్ సర్టిఫికెట్ చూపుతున్న విద్యార్థి పేరు మోహన్‌రెడ్డి. నాయినపల్లె స్వగ్రామం. మండల కేంద్రం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. 2010లో జన్మించాడు. మోహన్‌రెడ్డి పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం తల్లితండ్రులు వెంకటేశ్వరెడ్డి, కుమారి పలు మార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో నిరాశకు గురయ్యారు. వీరికి జగనన్న సురక్ష కార్యక్రమం వరంలా వచ్చింది. వలంటీర్ మోహన్‌రెడ్డి వివరాలు సేకరించి అధికారులకు సమర్పించారు. ఎక్కడికీ వెళ్లకుండానే బర్త్ సర్టిఫికెట్ మంజూరైంది. దీంతో విద్యార్థితో పాటు తల్లిదండ్రులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ఫొటోలో రెండు సర్టిఫికెట్లు చూపుతున్న వృద్ధురాలు లక్ష్మీదేవి స్వగ్రామం నందిపాడు. నిరక్షరాస్యురాలైన ఈ వృద్ధురాలికి సర్టిఫికెట్స్ గురించి ఏమీ తెలియదు. ఇంత వరకు ఈమెకు ఎలాంటి సర్టిఫికెట్లు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశ పెట్టడంతో వలంటీర్ ఆమె ఇంటికి వెళ్లి ఆరా తీశారు. తన వద్ద ఎలాంటి సర్టిఫికెట్లు లేవని.. కుల, ఆదాయ సర్టిఫికెట్ల ఇప్పించాలని కోరారు. ఈ మేరకు వివరాలు సేకరించిన వలంటీర్ అధికారులకు సమర్పించారు. దీంతో మంజూరైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు ఎలా తీసుకోవాలో కూడా నాకు తెలియదన్నారు. నాలాంటి వారికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగమని ఆనందం వ్యక్తం చేశారు వృద్ధురాలు.

ప్రజలకు అనుగుణంగా పరిపాలన

- మన పథకాలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు అధ్యయనం
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


పెట్నికోటలో సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. ప్రజాసంక్షమం, అభివృద్ధికి సమప్రాధాన్యనిస్తున్నారని, అన్ని సమాజికవర్గాలకు న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిపాడు,పె ట్నికోట గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అధికారులతో కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి న్యాయం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఎవరూ ఆలోచించని విధంగా ఇంటి వద్దకే పాలన అందిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం మన సంక్షేమ పథకాల అమలు తీరును అధ్యయనం చేస్తున్నారని గుర్తు చేశారు. ఒకప్పుడు గ్రామాల్లో రైతులు విత్తనాల కోసం ఎన్నో పాట్లు పడేవారని, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో సులభంగా లభిస్తున్నాయన్నారు. అధికారంలోకి రాగానే వృద్ధులకు పింఛన్ వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడంతో ఎంతో మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలు ఆర్థిక సమస్యలతో మధ్యలో చదువులు ఆపకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చారన్నారు. అంతేగాక నాడు–నేడు పథకంతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో నందిపాడు సర్పంచ్ గుర్విరెడ్డి, పెట్నికోట ఎంపీటీసీ సభ్యురాలు రామలింగమ్మ, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోందని తహసీల్దార్ పుష్పకుమారి, గ్రామ సర్పంచ్ ఆసం మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సొదరదిన్నె గ్రామ సచివాలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. తహసీల్దార్‌తోపాటు ఎంపీడీఓ రాధిక ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని అమడాల, గుంజలపాడు, సొదరదిన్నె గ్రామాల్లో అన్ని అర్హతలు ఉండి నాలుగేళ్లకాలంలో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాలు వర్తించని పేదల వివరాలను పరిశీలించారు. అనంతరం ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, అమడాల సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అమడాల శంకరయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఎంఎల్‌ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న సురక్ష

– 14,833 సర్టిఫికెట్ల పంపిణీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నెల రోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సాంకేతిక సమస్యల మూలంగా ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోయిన పేదలను గుర్తించి న్యాయం చేసేందుకు, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంతో మందికి మేలు జరిగింది. సర్టిఫికెట్ అంటే ఏమిటో తెలియని నిరక్షరాస్యులు సైతం కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. మండలంలో మొత్తం 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు వివరాలు సేకరించారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా 14,833 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. వీటి కోసం ప్రభుత్వం రూ.7.40 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు.

కుందూ కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: వందలాది గ్రామాలకు తాగు, సాగునీరు అందిస్తున్న కుందూనది కలుషితం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని నది పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కోవెలకుంట్లలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆ సమితి అధ్యక్షుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, ముఖ్య నాయకులు కామని వేణుగోపాల్‌రెడ్డి, కరీంబాషా, సుధాకర్, ఓబులేసు, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పరిసర ప్రాంతాల్లోని వివిధ ఫ్యాక్టరీల నుంచి ఇటీవల రసాయన వ్యర్థాలను నదిలోకి వదలడంతో చేపలు మృత్యువాతపడ్డాయన్నారు. ఈ విషయంపై బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి జెడ్పీ సమావేశంలో చర్చించారన్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపారన్నారు. భవిష్యత్తులో కుందూనది నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లులో వెల్దుర్తి మండలం, ఎల్‌బండ తండాకు చెందిన బాలునాయక్ నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. అతని నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిచినట్లు చెప్పారు.


వేషధారణలతో సందడి చేస్తున్న కళాకారులు


జెండ కట్ట వద్ద కొలువైన ఖాసీం పీర్ల దేవుళ్లు


డోన్‌లో దస్తగిరి స్వామి ఊరేగింపు దృశ్యం

ఘనంగా పెద్ద సరిగెత్తు

- వెయ్యి దివిటీల వెలుగులో ఊరేగిన హజరత్ అబ్బాస్ పీరు
- మాతం నిర్వహించిన షియా మతస్తులు
- ప్రత్యేక ఫాతేహాలు సమర్పించిన భక్తులు


ఆకుమల్లలో కొలువుతీరిన పీర్లదేవుళ్లు


కోవెలకుంట్లలో దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరుతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

కోవెలకుంట్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీరును గురువారం అర్ధరాత్రి వెయ్యి దివిటీల వెలుగులో ఘనంగా ఊరేగించారు. ఖర్బలా మైదానంలో యజీద్‌రాజుతో జరిగిన యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం ఉశేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుడైన హజరత్ అబ్బాస్ మృతి చెందగా ఆయనను స్మరించుకుంటూ ప్రతిఏటా మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధ్య సరిగెత్తును పురస్కరించుకుని అర్ధరాత్రి వెయ్యి దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరును పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు చెందిన షియా మతస్తులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పెద్దసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కొలువైన పీర్ల దేవుళ్లకు భక్తులు పూలదట్టీలు సమర్పించి మొక్కులు తీర్చున్నారు. ఆయా చావిళ్ల ఎదుట అగ్ని గుండాల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఫాతెహాలు నిర్వహించారు.

బేతంచెర్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్దసరిగెత్తును భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లోని చావిళ్లలో కొలువుదీరిన పీర్ల దేవుళ్లను కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అవుకు: అవుకుతోపాటు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కుల,మతాలకు అతీతంగా భక్తులు పీర్ల దేవుళ్లను దర్శించుకొని చక్కెర చదివింపులు చేశారు. భారీ ఎత్తున పూల సూ స్కేలు, పూల తోరణాలు, దట్టీలు, వెండి గొడుగులు పీర్ల దేవుళ్లకు భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

డోన్/ డోన్ టౌన్ : మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్దసరిగెత్తును భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామా ల్లోని చావిళ్లలో కొలువైన పీర్ల దేవుళ్లను భక్తులు దర్శించుకుని చెక్కర చదివింపులు, వెండి గొడుగులను బహూకరించారు. కొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా కందూర్లు(జంతుబలి) సమర్పించారు. చిత్ర ,విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. కొండపేట జెండకట్ట వద్ద కొలువైన ఇమాం ఖాసీం పీర్ల చావిడిలో డిపో ఖాసీం వలి కుమారులు, వక్ఫ్ బోర్డు ముత్తువలి ,షేక్ మాలిక్ బాషా ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.


పీర్లదేవుళ్లకు పూలదట్టీ సమర్పిస్తున్న భక్తులు

సంజామల: మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్దసరిగెత్తు ఘనంగా జరిగింది. మండల కేంద్రం సంజామలతోపాటు గ్రామాల్లోని చావిళ్లలో కొలువైన పీర్లదేవుళ్లను కులమతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆయ గ్రామాల్లో పీర్ల స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు.

బనగానపల్లెరూరల్: బనగానపల్లెతోపాటు గ్రామాల్లో శుక్రవారం పెద్దసరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కొండపేటలోని పెద్దపీర్ల చావిడిల్లో కొలువైన శ్రీ ఇమామే హుస్సేన్,ఇమామే హస్సన్ పీర్లతో పాటు పట్టణంలో కొలువైన పలు పీర్లను కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లదేవుళ్లకు పూలదట్టీలు, వెండి గొడుగులు సమర్పించారు.


బీబీ ఫాతిమా పీర్ల వద్ద నృత్యం చేస్తున్న మహిళలు

కొలిమిగుండ్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం తిమ్మనాయినపేటతో పాటు పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. తిమ్మనాయినపేటలో హుశేన్‌స్వామితో పాటు ఇతర పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్యాపిలి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్ద సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఖాజా బందేనవాజ్, గుడిమిరాళ్ల, దస్తగిరి, బీబీ ఫాతిమ తదితర పీర్ల స్వాములకు పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు చదివించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు మొహర్రం వేడుకలకు హాజరై పీర్ల స్వాములకు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పట్టణంలో జరిగే మొహర్రం వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. సాధారణంగా పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన గుండం చుట్టూ పురుషులు చిందులు వేస్తారు. అయితే బీబీ ఫాతిమా పీర్ల వద్ద మాత్రం మహిళలు గుండం చుట్టూ అలాయి చిందులు వేస్తారు. డప్పు లేకుండా లయ బద్ధంగా ఐసో..సాసన్...దూల అంటూ మహిళల నృత్యాలు చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా మహిళలు అధిక సంఖ్యలో తరలివస్తారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

బేతంచెర్ల: చామంతిపూల తోటలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తాడెపల్లి గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ శాస్త్ర వేత్త సుశీల అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని సీతారామాపురం, శంకరాపురం, బైనపల్లె గ్రామంలో ఉద్యాన శాఖ అధ్వర్యంలో రైతులకు చామంతి తోటల్లో వర్షాకాలం చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వేరుకుల్లు తెగులు, ఎర్ర నల్లి, తెల్ల నల్లి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ తాడెపల్లి గూడెం పాలక మండలి సభ్యురాలు సుమిత్ర, ఉద్యాన అధికారి రఘువరన్, వ్యవసాయ సహాయకుడు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్ర వేత్తలు

పార్కులో వసతులు కల్పిస్తాం

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నివాస గృహం ఎదురుగా ఉన్న నెహ్రూ నగర్ పార్కులో ప్రజలకు అనుగుణంగా మౌలిక వసుతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మరుగుదొడ్లు, క్యాంటీన్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన మల్లెంపల్లె రామచంద్రుడు, మంత్రి బుగ్గన పీఏలు మహేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలేషా, మిట్టా రవి తదితరులు పాల్గొన్నారు.


క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ రాజేష్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ రోడ్డు, బలపాలపల్లె నుంచి నూతనంగా వేసిన రహదారికి ఇరువైపులా ఏపీఓ శేషన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకటలక్ష్మమ్మ, చిన్న మద్దమ్మ, ఎంపీటీసీలు మరియమ్మ, రత్నమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 20 కిలోమీటర్ల మేర 8వేల మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గూని నాగరాజు, రవి, వెంకటేశ్వర్లు, రామయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న,తిమ్మయ్య, దివాకర్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

పెద్దవెంతుర్ల పాలం బడి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్లలో శుక్రవారం మినుము పంటపై ఏఓ జ్యోతి పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల గ్రూపు ఏర్పాటు, ఎన్నిక, ప్రాథమిక సర్వేపై అవగాహన కల్పించారు. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, ఎంపీఈఓ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సీఎం పెద్ద పీట

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి మల్టీపర్పస్ గోడౌన్ సొసైటీ కింద రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. రైతుల సౌకర్యార్థం నిర్మించే మల్టీపర్పస్ గోడౌన్ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, వీఆర్వో కృష్ణమూర్తితో కలిసి ఎంపీపీ పరిశీలించారు.


గోడౌన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

మిత్రుడి కుటుంబానికి అండ

డోన్ టౌన్ : మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఉలవల కృష్ణుడు బాల్యంలో చిన్నమల్కాపురం ప్రభుత్వ పాఠశాల్లో చదివారు. కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఉలవల కృష్ణుడు దుర్మరణం చెందగా మూడు నెలల కిందట పిడుగుపాటుకు అతని భార్య లక్ష్మీదేవి ఆకాల మృత్యువు చెందింది. వీరి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు బంధువుల చెంత ఉన్నారని తెలుసుకున్న చిన్నమల్కాపురం స్కూల్ బాల్య స్నేహితులు శుక్రవారం గ్రామానికి వెళ్లి తమ వంతు సాయంగా రూ.45వేలను సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. అనాథలుగా మారిని చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా బాల్య మిత్రులు కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సుబ్బు, శివుడు, రామ్మోహన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముంగిటకే సేవలు

డోన్ టౌన్ : వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ముంగిటకే అన్ని సేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి అన్నా రు. మండలంలోని యు.కొత్తపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులతో ముఖాముఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ తీసుకవచ్చి గ్రామీణ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయ రంగానికి 9గంటల ఉచిత విద్యుత్‌ను పగటి పూట అందిస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. రూ. వెయ్యి కోట్లతో సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తూ రైతులకు ప్రభుత్వం ఊతమిస్తుందని గుర్తు చేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ డోన్ డివిజన్ ఉప సంచాలయకులు అశోక్‌వర్ధన్ రెడ్డి, ఏఓ అబ్దుల్ షఫి, డోన్, ప్యాపిలి మండలాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు చంద్రన్న, వెంకటేశ్వరరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి మెరుగైన సేవలు అందిస్తుందని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ భరత్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి అన్నారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సలహా మండలి అధ్యక్షుడు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో వారు మాట్లాడారు. విత్తనం మొదలు దిగుబడులు అమ్మేవరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఖరీఫ్, రబీ తదితర సీజన్లలో రైతులు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకూడదన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం స్థానికంగా సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం కొలు రైతులకు కౌలు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ రమణమూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డోన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వేల్పుల చంద్రన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, సలహా మండలి గ్రామ అధ్యక్షులు బోరెడ్డి కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి రాజేశ్, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరత్ కుమార్‌రెడ్డి